# మారిన మనసు



అనగా అనగా ఒక రాజుగారు ఉన్నారు. ఆయన పేరు ఉత్తముడు. పేరుకు తగినట్లుగా అయన అన్ని విషయాలలోనూ ఉత్తముడే. బాగా చదువుకొన్నవాడు. అందువల్ల కవులను, పండితులను తన ఆస్థానంలో అట్టే పెట్టుకొని, వారికి మడులు, మాన్యాలూ ఇచ్చాడు. న్యాయశాస్త్రాలనూ, ధర్మశాస్త్రాలనూ రాజుగారు బాగాచదువు కొన్నారు. అయినా ఎప్పుడన్నా తను పొరపాటు పడవచ్చు! ఏ దోషమూ చేయని వాడికి తను శిక్ష వేయవచ్చు! నిజమైన దోషిని తను విడిచి పెట్టవచ్చు.

ఇటువంటివి జరగకుండా ఉండేందుకు గాను న్యాయ విషయాలలో తనకు సలహా నిచ్చేందుకు కొంతమంది పెద్దలను కూడా నియమించుకొన్నారు. అయినా పొరపాటు జరిగే అవకాశం ఉన్నదన్న అను

మానం తోచినప్పుడు, అన్ని విషయాలనూ. రాజుగారు స్వయంగా విచారించేవారు. మారువేషంతో నేరానికి సంబంధించిన అన్ని విషయాలను స్వయంగా తెలుసుకొనేవారు.

ఉత్తముడు తరచుగా ఎవరికీ చెప్పకుండా కోటలో నుండి మాయమయి పోతూ ఉండేవాడు. అలా మాయమయి రకరకాల వేషాలతో దేశమంతటా సంచారం చేసేవాడు. రకరకాల ప్రజలనూ కలుసుకొనేవాడు.

రాజుగారికున్న ఈ అలవాటును పొరుగు దేశంలో ఉన్న ఒక గజదొంగ గమనించాడు. ఉత్తముని రాజ్యంలో సిరి సంపదలకు లోటు లేదని ఆ దొంగ తెలుసుకొన్నాడు. కోటలో ఏ మూల చూసినా వెండి బంగారాలు, మణి మాణిక్యాలు రాసులు రాసులుగా పడి ఉంటాయని కూడా విన్నాడు.

కానీ కోటలోకి ప్రవేశించడ మెలా?

రాత్రింబవళ్లు ఆ కోటను రాజభటులు పహరా కాస్తూ ఉంటారు. వారి అనుమతి లేకుండా చిన్న ఈగ కూడా కోటలో ప్రవేశించడానికి అవకాశం లేదు.

నిజమే గానీ, ఉత్తమునికి సన్యాసులంటే విపరీతమైన భక్తి, విశ్వాసమూ ఉన్నాయి. రాజుగారు కోటలో ఉన్నప్పుడు—అది రాత్రి గానీ పగలు గానీ, కాషాయ వస్త్రాలు ధరించిన ఏ వ్యక్తికైనా ప్రవేశం ఉన్నది. ఈ కిటుకు తెలియడంతో గజదొంగ సంబర పడిపోయాడు.

ఆ మరునాడే ఈ గజదొంగ కూడా సన్యాసి వేషం వేసుకొన్నాడు. ఆ వేషంలో అతన్ని చూసినవారెవరూ ఇతడు దొంగ సన్యాసి అని అనుమానించరు. వెంటనే దొంగసన్యాసి కూడా రాజుగారిని దర్శించాడు. రాజుగారు నమస్కారం చేస్తే ఏవేవో తనలో తనే గొణుక్కుంటూ దీవించాడు. 'ఈ స్వామికి సకల ఉపచారాలూ చేయండి' అని ఉత్తరువు తన సేవకులకు ఆదేశించాడు.

ఒకటి రెండు రోజులు ఆ కోటనంతా తిరిగి చూశాడు గజదొంగ. ఎక్కడెక్కడ ఏ యే వస్తువులున్నాయో వాటిని ఎలా సంగ్రహించాలో, కాజేసిన వాటిని ఏవిధంగా కోట బయటకు చేరవేయాలో గుర్తులు ఉంచుకొన్నాడు.

ఆఖరు రోజున అతనికొక ఆలోచన వచ్చింది. అదేమిటంటే- సన్యాసి వేషం వేసినందుకే తనకు రాజభవనంలో ప్రవేశించడానికి అనుమతి లభించింది. ఇది మరొక మానవ మాత్రునికి సాధ్యం కాదు. ఆ దొంగ సన్యాసి వేషం కాకుండా, నిజంగానే సన్యాసి అయితే?

ఈ ఆలోచన రావడంతోనే అతను ఏ వస్తువునూ ముట్టుకోకుండా కోటదాటి వెలుపలికి వచ్చాడు. ఆ ఉదయమే తన పూర్వ జీవితాన్ని విడిచిపెట్టి, నిజమైన సన్యాసిగా దీక్షను స్వీకరించాడు.

—o—